
ప్రజాశక్తి
మంగళవారం 27 జూన్ 2023 5 విజయనగరం




15 నుంచి అంగన్వాడీల్లో టిహెచ్ఆర్ విధానం

విజయనగరం : జూలై 15వ తేదీ నుంచి అంగన్వాడీ కేంద్రాల్లో టిహెచ్ఆర్ (టేక్ హోం రేషన్) విధానం అమలవుతుందని దానికి సంబంధించిన ఏర్పాట్లను ప్రణాళికాయుతంగా చేసుకోవాలని జాయింట్‌కలెక్టర్ మయూర్ అశోక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కరోనా తర్వాత టిహెచ్ఆర్ మళ్లీ పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో సోమవారం తన ఛాంబర్లో ఐసిడిఎస్, సివిల్ సప్లై అధికారులతో సమావేశమయ్యారు. జూలై 15 నుంచి అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో నూతన విధానం అమల్లోకి వస్తుందని తద్వారా చిన్నారులకు మూడు కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, అరకేజీ ఆయిల్ అందజేయాలని సూచించారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణలో భాగంగా చిన్నారులకు పౌష్టికాహారం, వైఎస్సార్ కిట్లను సకాలంలో అందజేయాలని పేర్కొన్నారు. ఎండియు వాహనాల ద్వారా ఆయా అంగన్వాడీ కేంద్రాలకు సకాలంలో వైఎస్సార్ కిట్లను, నెలవారీ అందజేసే అన్ని రకాల సరకులను సరఫరాల చేసేలా చర్యలు తీసుకోవాలని డిఎస్ఒను ఆదేశించారు. సమావేశంలో డిఎస్ఒ మధుసూధన రావు, సివిల్ సప్లై డిఎం మీనా కుమారి, ఐసిడిఎస్ పీడీ శాంతకుమారి, సిడిపిఒలు పాల్గొన్నారు.

అమ్మఒడి.. అలజడి

- 28న ఖాతాల్లో నగదు జమ
- అర్హుల జాబితాపై ఉత్కంఠ
- ఏటా విద్యార్థుల జాబితాలో కోత

అమ్మఒడి పథకంపై విద్యార్థుల తల్లిదండ్రుల్లో అలజడి నెలకొంది. ఈ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 28న విద్యార్థుల తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయనుంది. తొలి ఏడాది రూ. 15వేలు, తరువాత రూ.14వేలు చెల్లించిన విషయం విధితమే. గత ఏడాది మరో రూ.1000 తగ్గించి రూ.13వేలు జమ చేసింది. ఈ ఏడాది ఎంత జమ చేయన ఉన్నారో తెలియాల్సి ఉంది. ప్రతి విద్యార్థికీ అమ్మఒడి అందజేస్తామని ఎన్నికల ముందు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంటికి ఒక విద్యార్థి అని పరిమితం చేశారు. ఆ తర్వాత క్రమ క్రమంగా నిబంధనలు అమలు చేస్తూ అర్హులను అనర్హులుగా ప్రకటించి ఈ పథకానికి దూరం చేస్తున్నారు. హాజరు శాతంతో పాటు ఆంక్షల మధ్య అమ్మఒడి ఎందరికి వస్తుందో, ఎవరికి రాదో సందేహాలు వెంటాడుతున్నాయి. ప్రస్తుతం జాబితా రూపొందించారు. ఏటా కోత పెడుతుండడంతో తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది.



ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉమ్మడి జిల్లాలో 2019-20 లో 1,73,420 మంది విద్యార్థులకు రూ.260.19 కోట్లు అమ్మఒడి పథకం ద్వారా అందజేశారు. 2020-21 లో 1,63,148 మందికి రూ.244.71 కోట్లు, 2021-22 లో 1,73,440 మందికి రూ.260.16 కోట్లు మంజూరు చేశారు. ఈ ఏడాది 1,66,180 మంది విద్యార్థులకు రూ 249.27 కోట్లు అందచేయనున్నారు. ఈనెల 28న మన్యం జిల్లా కురుపాం లో విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లో నగదును జమ చేయనున్నారు. విద్యా సంవత్సరంలో హాజరు నమోదు, బ్యాంకు అకౌంట్ అనుసంధానం వంటి అంశాలను తప్పనిసరి చేశారు. గతంలో బ్యాంకు ఐఎఫ్ఎస్‌సి కోడ్ మేరకు డబ్బును జమ చేసేవారు. గతేడాది నుంచి పిసిఐకి కనెక్ట్ చేస్తేనే నగదు జమ అవుతుంది. తల్లి దండ్రులకు ఎక్కువగా జీరో అకౌంట్, డ్వాక్రా, ఇతరత్రా అకౌంట్లు ఉన్నాయి. ఎక్కువ మంది మహిళలకు రెండు లేక మూడు అకౌంట్లు ఉండడంతో దేనికి ఆధార్, మొబైల్ నెంబర్ అనుసంధానంలో ఉందన్న విషయం తెలియలేదు. ఏ అకౌంట్‌కు ఎసిపిఐకి కనెక్టివిటీ ఉందో తెలియక బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేసారు. జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేదో తెలుసుకునేందుకు తల్లి దండ్రులు సచివాలయాలను సంప్ర దిస్తున్నారు.

8 అంశాలతో లబ్ధిదారుల ఎంపిక

అమ్మఒడి అర్హతకు ప్రభుత్వం విధించిన ప్రమాణాలు సక్రమంగా ఉన్నాయా లేదా అనే అంశంతో పాటు మరో 8 గ్రీవెన్స్ అంశాలు పరిశీలించనున్నారు. 75 శాతం హాజరు, 300 యూనిట్ల లోపు కరెంట్ బిల్లు, కారు లేదా జీపు, పొలం పరిమితి, గ్రామీణ ప్రజల కుటుంబ ఆదాయం నెలకు రూ.10 వేలు, పట్టణాల్లో రూ.12 వేలు, మున్సిపాలిటీ పరిధిలో వెయ్యి చదరపు అడుగులకు మించి స్థలం ఉండకూడదనే నిబంధనలు ఉన్నాయి. విద్యార్థి, తల్లి ఆధార్, జగనన్న విద్యాదీవెన పొందుతున్నారా, మ్యాపింగ్ నమోదు అయిందా లేదా అనే అంశాలను క్షుణ్ణంగా పరిశీలించనున్నారు.

లబ్ధిదారులు బ్యాంకు అకౌంట్లు నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు లింకప్ ఉండాలన్న నియమం కూడా ఇబ్బందులకు గురి చేస్తోంది. అమ్మఒడి లబ్ధిదారుల జాబితా తయారీపై ఎప్పటికప్పుడు కసరత్తు తప్పడం లేదు. గతంలో పాఠశాలకు లాగిన్ ఇచ్చిన ప్రభుత్వం ప్రస్తుతం సచివాలయాల్లోని వెల్ఫేర్ అసిస్టెంట్ల లాగిన్లకు తల్లిదండ్రులను పంపించి విద్యార్థుల సమాచారాన్ని సరిచేయిస్తోంది.

అర్హులందరికీ అమ్మఒడి



జిల్లాలో అమ్మఒడి అర్హుల జాబితా పరిశీలన ప్రక్రియ పూర్తి అయ్యింది. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఈ పరిశీలన సాగింది. విద్యా సంవత్సరం ప్రారంభం నేపథ్యంలో విద్యార్థులు పాఠశాలలు మారినప్పటికీ ఆందోళన చెందాల్సిన పనిలేదు. ప్రతి విద్యార్థికి ఐడి ఉంటుంది. అర్హులందరికీ అమ్మఒడి అందించేలా చర్యలు తీసుకుంటున్నాం.

- బి.లింగేశ్వరరెడ్డి, డిఇఒ



కలెక్టరేట్ గేటు వద్ద బైఠాయించిన ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

ప్రభుత్వ కళాశాలల్లో సమస్యలు పరిష్కరించాలని..

కలెక్టరేట్ వద్ద ఎస్ఎఫ్ఐ ధర్నా

భారీగా తరలివచ్చిన విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో మౌలిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. జిల్లా నలుమూలల నుంచి కళాశాలల విద్యార్థులు ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షులు సి హెచ్ వెంకటేష్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమైనా కళాశాలల్లో సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదని అన్నారు. ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులు భర్తీ చేయాలని, పెండింగ్ లో ఉన్న స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని, మధ్యాహ్న భోజనం తిరిగి ప్రారంభించాలని కోరారు. జూనియర్ కళాశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేయాలని, నాడు-నేడు నిధులు విడుదల చేసి అసంపూర్ణంగా ఉన్న తరగతి గదులు నిర్మాణం పూర్తి చేయాలని,మరుగుదొడ్లు , మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. విజయనగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం కేటాయించాలని, జూనియర్ కళాశాలల్లో స్థానికంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం జెసి మయూర్ అశోక్‌కు ఎస్ఎఫ్ఐ వినతి అందజేశారు. వారం రోజుల్లోగా సమస్యలు పరిష్కరించాలని, లేదంటే పెద్దఎత్తున ఉద్యమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రామకృష్ణ , జిల్లా సహాయ కార్యదర్శులు రవికుమార్ , సౌమ్య , వెంకీ, పట్టణ కార్యదర్శి రమేష్ , జిల్లా కమిటీ సభ్యులు అర్జున్ , లావణ్య ,సమీర, తదితరులు పాల్గొన్నారు.

వినతులపై ప్రతిరోజూ పర్యవేక్షణ

కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

జగనన్నకు చెబుదాం ప్రజా వినతుల కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీ సంతృప్తికరంగా పరిష్కారమయ్యే వరకూ దానిపై అధికారుల పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. సవివరమైన దర్యాప్తు లేకుండా ఏ ఒక్క వినతిని ఆదరబాదరాగా పరిష్కరించినట్టు మూసివేయవద్దని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా అధికారులంతా సీరియస్‌గా తీసుకొని తమ కిందిస్థాయి వాటి పరిష్కారానికి సిబ్బంది వాటిపై తగిన చర్యలు తీసువాలని సూచించారు. సోమవారం జిల్లా అధికారులతో సమగ్రంగా సమీక్షించారు. దాదాపు పద్దెనిమిది ప్రభుత్వ శాఖలకు సంబంధించిన 44 వినతులపై ఒక్కో శాఖ అధికారి నుంచి ఆయా వినతులు సంతృకరంగా పరిష్కారం కాకపోవడానికి కారణాలు తెలుసుకున్నారు. కొన్ని ప్రభుత్వ శాఖలు తమకు సంబంధంలేని వినతులు తమకు వచ్చినపుడు వాటిని తిప్పిపంపకుండా వాటిని పెండింగ్‌లో ఉంచుతున్నాయని, దీనివల్ల ఆయా వినతులపై ఎలాంటి చర్యలు చేపట్టే అవకాశం ఉండటంలేదని చెప్పారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో తమకు సంబంధం లేని వినతిని వేరే శాఖకు పంపించకుండా జాప్యంచేసిన ఇంజనీరింగ్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పంచాయతీరాజ్ ఎస్ఇని ఆదేశించారు. సచివాలయ ఉద్యోగుల బదిలీలకు సంబంధించి అంతర్ జిల్లా బదిలీలను మంగళవారం సాయంత్రం కల్లా పూర్తిచేసి ఆదేశాలు సిద్ధంచేయాలని ఆయా శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు.



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

జగనన్నకు చెబుదాంకు 303 వినతులు

కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమానికి 303 వినతులు అందాయి. కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌లు పద్మలత, నూకరాజు, సులోచనరాణి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ తదితరులు వినతులు స్వీకరించారు.

సచివాలయాలు గ్రామ దేవాలయాలు

విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ ● ఉత్తరావల్లిలో సచివాలయం, ఆర్‌బికె ప్రారంభం

ప్రజాశక్తి-మెరకముడిదాం

గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఆ గ్రామానికి గుడి, బడి లాంటి పవిత్ర ప్రదేశాలని రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. ప్రజలకు ఏ కష్టమొచ్చినా మొక్కుకోవడానికి గుడికి వెళ్లినట్లే, ఇప్పుడు ఏ సమస్య వచ్చినా సచివాలయాలకు, రైతు భరోసా కేంద్రాలకు వెళ్తున్నారని అన్నారు. అందువల్లే వీటికి గ్రామాల్లో గుడి, బడితో సమానమైన ప్రాముఖ్యత ఏర్పడిందన్నారు. మండలంలోని ఉత్తరావల్లిలో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను మంత్రి బొత్స సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ, ప్రసచివాలయాల్లో సుమారు 10 మంది సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు నిరంతరం ప్రజలకు సేవ చేసేందుకు అందుబాటులో ఉంచామని చెప్పారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా జులై 1 నుంచి 11 రకాల దవపత్రాలను ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అధికారులు ఇంటింటికీ వచ్చినప్పుడు తమకు కావాల్సిన సర్టిఫికేట్లు కోసం ధరఖాస్తు చేయాలని సూచించారు. సచివాలయ వ్యవస్థ పనితీరుపై ప్రశ్నించారు. గ్రామ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు అవసరమైన విత్తనాలను సరఫరా చేయడానికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాలన్నారు. రైతుల విజ్ఞప్తి మేరకు, వరి విత్తనాల సబ్సిడీని పెంచేందుకు తనవంతు కషి చేస్తానని బొత్స హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపి బెల్లాన చంద్రశేఖర్, డిఆర్‌ఒ ఎం.గణపతిరావు, ఆర్‌డిఒ ఎం.అప్పారావు, డిపిఒ శ్రీధర్‌రాజా, ఎంపిపి తాడ్డి కృష్ణవేణి, తాహశీల్దార్ విజయభాస్కర్, ఎంపిడిఒ రత్నం, ఎఒ జి.శ్రావణితేజ, తదితరులు పాల్గొన్నారు.

డిసిసిబి బ్రాంచ్ ప్రారంభం

మెరకముడిదాం మండల కేంద్రంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు 20వ శాఖను మంత్రి బొత్స సత్యనారాయణ ప్రారంభించారు. ప్రజల అవసరాలు, వ్యాపార విస్తరణ, జనాభా తదితర వాటిని దష్టిలో పెట్టుకొని, ఆర్‌బిఐ నిబంధనలకు అనుగుణంగా అందరికీ అందుబాటులో ఉండే చోట బ్రాంచ్‌లను ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. డిసిసిబి సిఇఒ కె.జనార్ధన మాట్లాడుతూ జిల్లాలో మరో ఐదు బ్రాంచ్‌లను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. దాదాపు అన్ని బ్రాంచ్‌ల్లో సుమారు రూ.100 కోట్లు టర్నోవరు దాటిందని, అందువల్ల కొత్త బ్రాంచ్‌లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఐదు మహిళా సంఘాలకు రూ.10 లక్షలు చొప్పున బ్యాంకు లింకేజి చెక్కులను మంత్రి అందజేశారు. కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ వేచలపు వెంకట చినరామినాయుడు, డిఆర్ఒ ఎం.గణపతిరావు, ఆర్‌డిఒ ఎం.అప్పారావు, ఎంపిపి తాడ్డి కృష్ణవేణి, తాహశీల్దార్ విజయభాస్కర్, ఎంపిడిఒ రత్నం, డిసిసిబి జిఎం కె.చంద్రశేఖర్, డిజిఎం సిహెచ్ ఉమామహేశ్వరరావు, బ్రాంచ్ మేనేజర్ కెఎ నాగరాజు, నోడల్ అధికారి పి.రామ్మోహన్, ఎజిఎంలు, బ్యాంకు సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



డిసిసిబి బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

60 మంది న్యాయవాదులకు వైఎస్ఆర్ లా నేస్తం

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో 60 మంది యువ న్యాయవాదులకు వైఎస్ఆర్ లా నేస్తం కింద జూనియర్ న్యాయవాదుల ఖాతాల్లో నెలకు రూ. 5 వేలు చొప్పున 2023 ఫిబ్రవరి నుంచి జూన్ వరకు 5 మాసాలకు సంబందించిన నిధులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సిఎం కార్యాలయం నుంచి బటన్ నొక్కి వారి ఖాతాలకు జమ చేశారు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ కలెక్టర్ నాగలక్ష్మి, మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ లావణ్య, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

నేడు పౌరసరఫరాల మంత్రి జిల్లాకు రాక

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రానికి చేరుకొని 11 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో ఆరు జిల్లాల పౌరసరఫరాల అధికారులు, జిల్లా మేనేజర్ లతో ప్రాంతీయ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. శ్రీకాకుళం, మన్యం, విజయనగరం, విశాఖ, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల అధికారులు ఈ సమావేశానికి హాజరు కానున్నారు. సమావేశం అనంతరం మంత్రి విశాఖ బయలుదేరి వెళ్లనున్నారు.

విద్యుత్తు భారంపై పోరాటం

ప్రజాశక్తి-బొబ్బిలి

రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్తు ఛార్జీలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని ప్రజా సంఘాల నాయకులు తీర్మానించారు. విద్యుత్తు ఛార్జీల పెంపునకు వ్యతిరేకంగా పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బృందావనం ఫంక్షన్ హాల్లో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రౌతు రామమూర్తి మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వస్తే ఉచిత విద్యుత్తు ఇస్తామని చెప్పిన సిఎం జగన్మోహన్‌రెడ్డి.. విద్యుత్తు ఛార్జీలు పెంచడం దుర్మార్గమన్నారు. సర్దుబాటు ఛార్జీల పేరుతో సామాన్యులపై భారాలు వేయడం అన్యాయమన్నారు. కేసుల భయంతో, అప్పుల కోసం కేంద్ర ప్రభుత్వానికి తలొగ్గి, విద్యుత్తు చట్టసవరణ బిల్లును ఆమోదించి రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లు పెట్టడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. పట్టణ పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ పి.శంకరరావు మాట్లాడుతూ విద్యుత్తు ఛార్జీల పెంపుతో పరిశ్రమలు మూతపడుతున్నాయని చెప్పారు. గ్రోత్ సెంటర్లో ఉన్న ఫెర్రో పరిశ్రమలపై విద్యుత్తు ఛార్జీలు పెంపు తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు చెప్పారు. పరిశ్రమలు మూతపడి కార్మికులు రోడ్డున పడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. విద్యుత్తు ఛార్జీలు పెంపునకు, స్మార్ట్ మీటర్లు ఏర్పాటుకు వ్యతిరేకంగా ఈ నెల 30న విద్యుత్తు శాఖ సబ్ డివిజనల్ కార్యాలయం వద్ద ధర్నా చేసేందుకు తీర్మానించారు. కార్యక్రమంలో జెవివి నాయకులు పి.సత్యం నాయుడు, లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు జి.భాస్కరరావు, మాజీ కౌన్సిలర్ ఎన్నాబాబు, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం, మున్సిపల్, అంగన్వాడీ యూనియన్ నాయకులు గౌరీష్, కామేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

లక్కవరపుకోట : పెరిగిన విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గాడి అప్పారావు డిమాండ్ చేశారు. విద్యుత్తు ఛార్జీల పెంపుదలను వ్యతిరేకిస్తూ ఎల్.కోట చెరువులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలను కలిసి, అభిప్రాయాలు సేకరించారు. ఎస్‌సి మహిళలు కొందరు తమకు ఉచిత విద్యుత్తు ప్రకటించినా, బలవంతంగా బిల్లులు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విషయంపై త్వరలో ఎల్.కోట సబ్‌స్టేషన్ ముట్టడించనున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు టి.వెంకటరమణ పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న నాయకులు

ఉపాధి బకాయిలు తక్షణమే చెల్లించాలి

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉపాధి బకాయిలు తక్షణమే చెల్లించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు గాడి అప్పారావు, గొర్లి శ్రీనివాసరావు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో రూ.2.50కోట్లు ఉపాధి కూలీలకు ప్రభుత్వం చెల్లించలేదని తెలిపారు. ఈ సంవత్సరం చాలా ఇబ్బందులతో రెండు పూటలా వడదెబ్బతో పనిచేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. దీనికి తోడు సాఫ్ట్‌వేర్ ఇబ్బందులను రుద్దారని, నాలుగైదు వారాల వరకు బకాయిలు చెల్లించకుండా కొత్త పనులు చూపించకుండా తూతూ మంత్రంగా ఉపాధి పథకాన్ని అమలు చేయాలని దురుద్దేశంతో పథకాన్ని ఎత్తివేసేందుకు ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపాధి హామీ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని

భార్యను చంపేసిన ఉన్మాది

ప్రజాశక్తి-బొబ్బిలి

వివాహేతర సంబంధానికి అడ్డుగా వస్తుందని భార్యను హత్య చేసిన సంఘటన బొబ్బిలి మండలం పారాదిలో చోటు చేసుకుంది. ఎస్ఐ చదలవాడ సత్యనారాయణ కథనం ప్రకారం... రామభద్రపురం మండలం మర్రివలస గ్రామానికి చెందిన సూరెడ్డి రవి, గౌరీశ్వరి దంపతులు జీవనోపాధి కోసం రెండేళ్ల క్రితం బొబ్బిలి మండలం పారాది వచ్చారు. పారాదిలో టీ, టిఫిన్ దుకాణం నడుపుకుని జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. పారాది గ్రామానికి చెందిన వేరే మహిళతో రవికి వివాహేతర సంబంధం ఏర్పడటంతో భర్తను గౌరీశ్వరి నిలదీసేది. ఈవిషయమై భార్యభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఎలాగైనా భార్యను వదిలించుకోవాలనుకున్న రవి ఆదివారం రాత్రి ఆమెతో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో ఇంటిలో ఉన్న చెక్కపేడుతో బలంగా తలపై కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మరణించింది. తన భార్య తలకు ఫ్యాన్ తగలడం వల్ల చనిపోయిందని చుట్టుపక్కల వారిని నమ్మించి గౌరీశ్వరి మృతదేహాన్ని స్వగ్రామం తీసుకుపోయాడు. గౌరీశ్వరి తల్లిదండ్రులకు సమాచారం అందడంతో వారొచ్చి మృతదేహాన్ని చూడగా తలపై గాయాలుండటాన్ని గమనించారు. అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రవిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా, తానే హత్య చేసినట్లు అంగీకరించాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.



గౌరీశ్వరి మృతదేహం

నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ప్రభత్వం నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం డిఎంహెచ్ఒ కార్యాలయం వద్ద ఎపి నేషనల్ హెల్త్ మిషన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ కమిటీ జెఎసి జిల్లా కన్వీనర్ జి.ధనలక్ష్మి, జిల్లా కో కన్వీనర్ పి.దుర్గారావు, ఎన్‌హెచ్‌ఎం స్టాఫ్ నర్సు యూనియన్ జిల్లా నాయకులు ఎస్.ఇందిరా, శ్రీలత, కుమారి, హాస్పిటల్ కంటిన్యూజెంట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె సురేష్ మాట్లాడారు. పంజాబ్, అస్సాం, హర్యానా, ఒడిస్సా రాష్ట్రాల్లో మాదిరిగా నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులకు సమాన పనికి, సమాన వేతనం మినిమం టైం స్కేలు అమలు చేయాలని కోరారు. హెచ్‌అర్ పాలసీ, హెల్త్ ఇన్సూరెన్స్, జనరల్ ఇన్సూరెన్స్, అమలు చేయాలన్నారు. అనంతరం డిఎంఅండ్‌హెచ్ఒ భాస్కరరావుకు వినతి అందజేశారు.



ధర్నా చేస్తున్న నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

ప్రజాశక్తి-విజయనగరం

మత్తు పదార్థాల వినియోగానికి యువత దూరంగా ఉండి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఎస్‌పి ఎం.దీపిక సూచించారు. విక్రయం, రవాణా, వినియోగించేవారి సమాచారాన్ని స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 14500 నెంబరుకు ఇవ్వాలని కోరారు. అంతర్జాతీయ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం నగరంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. 1వ, 2వ పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో ఆర్‌టిసి కాంప్లెక్సు నుండి ఎత్తు బ్రిడ్జి వరకు సాగిన ఈ ర్యాలీని ఎస్‌పి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగంకు యువత దూరంగా ఉండాలన్నారు. వ్యసనాలకు యువత బానిసై లక్ష్యానికి దూరం కావద్దన్నారు. మత్తు పదార్థాలకు అలవాటుపడే యువత శారీరక రుగ్మతలకు లోనై, జ్ఞాపకశక్తి కోల్పోయి, విచక్షణ, విజ్ఞత కోల్పోయి, నేరాలకు పాల్పడుతూ, దురదష్టవసాత్తు కేసుల్లో నిందితులుగా మారుతున్నారని అన్నారు. జిల్లాను మాదక ద్రవ్యరహితంగా మార్చేందుకు, యువతకు మాదక ద్రవ్యాలకు దూరం చేసేందుకు, విద్యా సంస్థలు, ముఖ్య కూడళ్లలో హోరింగ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. ర్యాలీలో డిఎస్‌పి ఆర్.గోవిందరావు, 1వ పట్టణ సిఐ బి. వెంకటరావు, 2వ పట్టణ సిఐ సిహెచ్.లక్ష్మణరావు, ఎస్‌బి సిఐ జి. రాంబాబు, ఎస్ఐలు భాస్కరరావు, రామగణేష్, ట్రాఫిక్ ఎస్ఐలు మహేశ్వర రాజు, త్రినాధరావు, వివిధ కళాశాలల విద్యార్థులు, ఎన్‌సిసి క్యాడెట్లు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులపై తక్షణ చర్యలు

స్పందన ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు ఎస్‌పి సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో వినతులు స్వీకరించారు. బాధితుల సమస్యలను అడిగి తెలుసుకొని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడి, వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఆ దేశించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డిఎస్పీ విశ్వనాధ్, డిసిఆర్‌బి సిఐ జె.మురళి, ఎస్‌బి సిఐ జి.రాంబాబు, డిసిఆర్‌బి ఎస్ఐ వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎస్‌పి దీపిక, పోలీసులు, విద్యార్థులు

పంచాయతీ కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి-రామభద్రపురం

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు మండల కార్యదర్శి బలస శ్రీను ఆధ్వర్యాన సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికుల సంఘం నాయకులు పరమేష్, లక్ష్మి, శ్యామల మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కార్మికుల జీతాల్లో వ్యత్యాసాలు లేకుండా అందరికీ సమానంగా ప్రతి నెల ఐదో తేదీలోగా వేతనాలు బ్యాంకు ఖాతాలో వెయ్యాలని డిమాండ్ చేశారు. 20 నెలల కిందట వేతన పెంపుదలకు ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదని. ఆ హామీ అమలు చేయాలని కోరారు. పిఎఫ్, ఇన్సూరెన్స్, గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించకుంటే సమ్మెకు దిగుతామని నోటీసును ఎంపిడిఒ రమామణికి అందజేశారు.

సబ్‌జైలును సందర్శించిన జడ్జి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టణంలోని సబ్ జైలును జూనియర్ సివిల్ జడ్జి సబ్బవరపు వాణి సోమవారం సందర్శించారు. ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్ జైల్ సూపరింటెండెంట్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే భవిష్యత్తుకు గ్యారెంటీ

టిడిపి యువ నేత గొంప కృష్ణ

ప్రజాశక్తి-వేపాడ

విజన్ కలిగిన టిడిపి అధినేత చంద్రబాబునాయుడుతోనే ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ లభిస్తుందని ఆ పార్టీ నియోజకవర్గ యువ నేత గొంప కృష్ణ తెలిపారు. సోమవారం మండలంలోని వల్లంపూడి గ్రామంలో టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, బిటిడిపి మండల అధ్యక్షులు సేనాపతి గణేష్ అధ్యక్షతన టిడిపి భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి మేనిఫెస్టో ప్రజల్లో మంచి ఆదరణ లభిస్తోందన్నారు. రానున్న కాలంలో చంద్రబాబునాయుడును సిఎంను చేయడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు గుమ్మడి భారతి, నాయకులు సిరికి రమణ, గొర్లె నాగరాజు, ఎం.అప్పలనాయుడు, డి.రమేష్, సేనాపతి లీలా అప్పారావు, మంచిన అప్పలరాజు, కె.అర్జునరావు, చప్ప దేముడు, వై.సూర్యం, ముక్క రామకృష్ణ పాల్గొన్నారు.

మిగులు సీట్లు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక వేణుగోపాలపురం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మిగులు సీట్లకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పాఠశాల ప్రిన్సిపల్ కె. ఉషారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 6వ తరగతికి 18 సీట్లు, 7వ తరగతిలో 6 సీట్లు, 8వ తరగతిలో 8 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. దరఖాస్తులు సమర్పించడానికి ఈ నెల 28వ తేదీ వరకు గడువు ఇచ్చినట్లు వెల్లడించారు. దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రాల జెరాక్స్ కాపీలు సమర్పించాలన్నారు. దరఖాస్తు దారులందరికీ ఈ నెల 30న ఉదయం 10గంటలకు ఆబ్జెక్టివ్ తరహాలో ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. పరీక్షలో వచ్చిన మార్కులు, రిజర్వేషన్ ప్రకారంగా సీట్లు కేటాయిస్తామన్నారు.

ఆదర్శ పాఠశాలలో..

వేపాడ : మండలంలోని బక్కునాయుడుపేట వద్దనున్న ఆదర్శ పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్లు భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నెల 28 వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ రావాడ ఈశ్వరరావు కోరారు. పాఠశాలలో దరఖాస్తులు లభిస్తాయని చెప్పారు.

పాఠశాలలో తల్లిదండ్రుల కమిటీ సమావేశం

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని పినతాడివాడ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం తల్లిదండ్రుల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ సిహెచ్ రాధాకృష్ణ విద్య కోసం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అమ్మఒడి, జగనన్న విద్యా కానుక, జగనన్న ఆణిముత్యాలు, మన బడి నాడు నేడు, జగనన్న గోరుముద్ద, టాబ్స్ పంపిణీ మొదలైన కార్యక్రమాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మణరావు, ఎంపిటిసి అచ్చం నాయుడు, సిఆర్‌పి భాస్కరరావు, పేరెంట్ కమిటీ ఛైర్మన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు మార్పుపై వినతి

బొండపల్లి : మండలంలోని రయింద్రం గ్రామ సమీపంలో కనిమెరక పంచాయతీకి సంబంధించిన నిర్మించి తలపెట్టిన డంపింగ్ యార్డు స్థలాన్ని మార్పు చేయాలని రయింద్రం సర్పంచ్ ముదునూరు శ్రీనివాసరాజు ఆధ్వర్యాన గ్రామస్తులు స్పందనలో వినతి అందించారు. మరోచోట డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని కోరారు.

డ్రగ్స్‌పై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

యువతా మేలుకో డ్రగ్స్ నుంచి తేరుకో.. అంటూ సోమవారం పట్టణంలోని వివిధ కళాశాలల విద్యార్థులు మాదకద్రవ్యాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎస్ఇబి సిఐ ధర్మారావు ఆధ్వర్యాన ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఎస్ఇబి ఎస్ఐ ఎన్.రమ్యశ్రీ, సిబ్బంది ఎస్.కె.సత్తార్, డి.శివకుమార్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పి.కృష్ణమూర్తి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సిసి కేర్ టేకర్ పి.భాస్కర్ పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు వేగవంతం

ప్రజాశక్తి-వేపాడ

నాడు-నేడు పనులు వేగవంతం చేసి, సకాలంలో పూర్తిచేయాలని ఎంఇఒ బి.బాలభాస్కరరావు.. ప్రధానోపాధ్యాయులకు సూచించారు. సోమవారం స్థానిక ఎంఆర్‌సిలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28న అమ్మఒడి పథకాన్ని సిఎం జగన్ ప్రారంభించనున్న దృష్ట్యా విద్యార్థులంతా ఆరోజు నూతన యూనిఫాం ధరించి, రావాలన్నారు. అమ్మఒడి కార్యక్రమాన్ని లైవ్‌లో విద్యార్థుల తల్లిదండ్రులు వీక్షించేలా చూడాలని కోరారు.

విత్తనాల దుకాణాల ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతిలో విత్తనాల దుకాణాలను సోమవారం రాజాం వ్యవసాయ సహాయ సంచాలకులు కె. చంద్రరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక మనగ్రోమోర్ సెంటర్, శ్రీనివాస ట్రేడర్స్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రిజిస్టర్లు, బిల్ బుక్స్, నిల్వాలు పరిశీలించి డీలర్‌లు ఎవరైనా అధిక ధరలకు, నాణ్యత ప్రమాణలకు లోబడి విక్రయిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు విత్తనాలను డీలర్స్ దగ్గర గాని, రైతు భరోసా కేంద్రాలలో కానీ తీసుకున్న తరువాత మొలక శాతం కట్టుకుని అనంతరం పొలాల్లో వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ ఎం.పూర్ణిమ, కానిస్టేబుల్, ఎఇఒ తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఒ కార్యాలయ ఎఒగా వెంకటరావు

బొండపల్లి : బొండపల్లి ఎంపిడిఒ కార్యాలయ ఎఒగా దత్తి వెంకటరావుకు ఉద్యోగోన్నతి లభించింది. ప్రస్తుతం ఎంపిడిఒ కార్యాలయంలో సీనియర్ సహాయకులుగా విధులు నిర్వహిస్తున్నారు.ఎఒగా బాధ్యతలు స్వీకరించిన ఆయనకు ఎంపిపి చల్ల చలంనాయుడు, ఎంపిడిఒ వైవి.రాజేంద్రప్రసాద్, తహశీల్దార్ ప్రసాదరావు. ఇఒపిఆర్‌డి సుగుణాకర్‌రావు, పంచాయతీ కార్యదర్శులు శుభాకాంక్షలు తెలియజేశారు.

పోయిన బ్యాగ్ అందజేత

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఆటోలో మరిచి పోయిన బ్యాగ్‌ను పోలీసులు మహిళకు అందజేశారు. సోమవారం గంట్యాడ మండలం మురపాక గ్రామానికి చెందిన మహిళ ఈ నెల 23న నెల్లిమర్లలో ఆటోలో ప్రయాణిస్తూ తన వెంట తెచ్చుకున్న బ్యాగును ఆటోలో మరిచిపోయి నెల్లిమర్లలో దిగిపోయింది. అయితే మహిళ బ్యాగులో వాళ్ళ అమ్మాయి తాలూక సర్టిఫికెట్లు, విలువైన సామాన్లు ఉన్నాయని 24న ఎస్ఐ పి.నారాయణ రావుకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఎస్ఐ నారాయణరావు వెంటనే స్పందించి తన సిబ్బందితో కలిసి బ్యాగును వెతికి పట్టుకొని మహిళకు అప్పగించారు.

రూ.9065 కోట్లతో జిల్లా రుణ ప్రణాళిక

లక్ష్యాలకు మించి రుణాలివ్వాలి : విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరం

2023-24 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.9065 కోట్ల తో వార్షిక రుణ ప్రణాళిక ను రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సోమవారం విడుదల చేసారు. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి అధ్యక్షతన కలెక్టరేట్ సమావేశ మందిరం లో జిల్లా స్థాయి డిసిసి, డిఎల్ ఆర్ సి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ఏడాది రూ. 7509 కోట్లతో రుణ ప్రణాళికను రూపొందించగా సరాసరి 106.21 శాతాన్ని సాధించి అనేక రంగాల్లో శతశాతం లక్ష్యాలను సాధించినందుకు అధికారులను, బ్యాంకర్లను మంత్రి అభినందించారు. ఈ ఏడాది రుణ ప్రణాళిక లో వ్యవసాయ రంగానికి 5823 కోట్లను, ఎంఎస్ఎంఇ రంగానికి 1211 కోట్లను, ఇతర ప్రాధాన్యత రంగాల రుణాల కోసం 441 కోట్లను కేటాయించారు. నాన్ ప్రయారిటీ సెక్టార్ రుణాల కోసం 1590 కోట్లను కేటాయించినట్లు తెలిపారు. వ్యవసాయాధారిత జిల్లా అయినందున గత ఏడాది కంటే విరివిగా రుణాలను అందజేసి రైతులకు చేయుతనివ్వాలని బ్యాంకర్లను కోరారు. జగనన్న కాలనీలకు కూడా రుణాలను అందజేయాలని అన్నారు. తొలుత కలెక్టర్ నాగలక్ష్మి గత ఏడాది లక్ష్యాలను సమీక్షించారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు, ఎంఎస్ఎంఇలకు ప్రాధాన్యత నివ్వాలని బ్యాంకర్లకు సూచించారు. మార్జిన్ మనీ కూడా త్వరగా విడుదల చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస రావు, ఆర్‌బిఐ ప్రతినిధి, అన్ని బ్యాంకులకు చెందిన అధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



రుణప్రణాళిక బ్రోచర్‌ను విడుదల చేస్తున్న మంత్రి బొత్స, జెసి, లీడ్‌బ్యాంకు మేనేజర్

ఫీల్డ్ అసిస్టెంట్ నియామకంలో నిబంధనలకు నీళ్లు

కలెక్టర్‌కు టిడిపి సర్పంచ్, గ్రామస్తుల ఫిర్యాదు

ప్రజాశక్తి-మెంటాడ

మండలంలోని ఇప్పలవలస ఫీల్డ్‌అసిస్టెంట్ నియామకంలో అధికారులు నిబంధనలను ఉల్లంఘించారని సర్పంచ్ గెద్ద పైడిరాజు, సీనియర్ మేట్ వసంత, కూలీలు, గ్రామస్తులు సోమవారం స్పందనలో కలెక్టర్ నాగలక్ష్మికి ఫిర్యాదు చేశారు. గతంలో ఫీల్డ్‌అసిస్టెంట్‌గా పనిచేసిన సీతంనాయుడు సుమారు రూ.5 లక్షల మేర అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణల నేపథ్యంలో ఆయన నుంచి రికవరీ చేసిన విషయాన్ని ఫిర్యాదులో ప్రస్తావించారు. సీతంనాయుడు స్థానంలో అర్హతలు లేకున్నా ఆయన భార్య వేపాడ పద్మను నియమించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రామంలో సీనియర్ మేట్లను కాదని ఆమెను నియమించడంతో పిఆర్‌ఆర్‌డి కమిషనర్ ఉత్తర్వులను బేఖాతరు చేశారని తెలిపారు. 2010 నుంచి సీతం నాయుడు, ఆయన భార్య పద్మ స్థానికంగా లేరని వివరించారు. గత ఏప్రిల్ నుంచి ప్రారంభమైన ఉపాధి పనుల్లో కేవలం 20 రోజులే పని చేసిన పద్మ క్షేత్ర సహాయకురాలిగా ఎలా అర్హురాలని ప్రశ్నించారు. ఈ విషయంలో రాజకీయ జోక్యానికి డ్వామా పీడీ, మెంటాడ ఎంపిడిఒ ప్రభావితమైనట్లు ఆరోపించారు. వెంటనే విచారణ చేపట్టి, పద్మ నియామకాన్ని రద్దు చేసి, పైన పేర్కొన్న ఇద్దరు అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై అవసరమైతే న్యాయ పోరాటానికి సిద్ధమవుతామని టిడిపి మండల అధ్యక్షులు చలుమూరి వెంకట రావు, నాయకులు గెద్ద అన్నవరం తదితరులు స్పష్టం చేశారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి- భోగాపురం



నెల్లిమర్ల : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనాయుడు

తీర ప్రాంత గ్రామాల్లో అత్యధికంగా తాగునీటి సమస్య ఉందని, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు చొరవ చూపి పరిష్కరించాలని ముక్కాం గ్రామస్తులు సోమవారం అడిగారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఆ గ్రామంలో పర్యటించారు. గ్రామంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల అందుతున్న తీరును, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా జగనన్న ఇల్లులు అందలేదని, ఇల్లు నిర్మించుకున్న వాటికి బిల్లులు కూడా మంజూరు కాలేదని, తాగునీటి సమస్య అధికంగా ఉందని పలువురు మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే స్పందిస్తూ తాగునీటిపై ప్రత్యేక దృష్టి సారించామని త్వరలో సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఇళ్ల పట్టాల విషయమై కోర్టులో పెండింగ్‌లో ఉందని తెలియజేశారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ సూర్యనారాయణ, మత్స్య కార్పొరేషన్ డైరెక్టర్ మైలపల్లి నరసింహులు, వాసుపల్లి రొయ్యుడు, వైసిపి నాయకులు పడాల భాను, కర్రోతు శ్రీనివాసరావు, పోతిరెడ్డి గోపి, ఎంపిడిఒ అప్పలనాయుడు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు మరింత చేరువ కావాలి

నెల్లిమర్ల : జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలకు మరింత చేరువ కావాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పి. సురేష్ బాబు సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో పరిశీలకులు అందవరపు సూరిబాబు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం అమలులో భాగంగా మండల స్థాయి అధికారులు, నగర పంచాయతీ అధికారులు, రూరల్, అర్బన్ గృహ సారథులు, నాయకులు, సచివాలయం సిబ్బందికి దిశా నిర్దేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు మాట్లాడుతూ ప్రభుత్వ పరమైన సేవలు అందించడంతో బాటు అర్హత కలిగి సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి వారికి ఆయా పథకాలు అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిపి అంబళ్ళ సుధారాణి, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యులు అంబళ్ళ శ్రీ రాములు నాయుడు, డిసిసిబి వైస్ ఛైర్మన్, మండల పార్టీ అధ్యక్షులు చనమల్ల వెంకట రమణ, జెడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు, వైస్ ఎంపిపిలు సారికి వైకుంఠం నాయుడు, పతివాడ సత్య నారాయణ, నగర పంచాయతీ ఛైర్మన్ బంగారు సరోజినీ, వైస్ ఛైర్మన్‌లు సముద్రపు రామారావు, కారుకొండ వెంకట కృష్ణారావు, పట్టణ వైసిపి అధ్యక్షులు చిక్కాల సాంబ శివ రావు, ు, తహశీల్దార్ కె.వి.రమణ రాజు, కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్, టూరిజం రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఏ చిన్న సమస్య ఉన్నా పరిష్కరించాలి

ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-కొత్తవలస

ప్రతి ఇంట్లో ఏ చిన్న సమస్య ఉన్నా దానిని పరిష్కరించాలన్న ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమం చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. కొత్తవలస మండలం వీరభద్రపురం సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టారు. జగనన్న సురక్ష కార్యక్రమం అమలుతో ప్రభుత్వ సేవలు మరింత సులభతరం అవుతాయని ఆయన చెప్పారు. కార్యక్రమంలో కొప్పల వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ నెక్కల నాయుడుబాబు, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, ఎంపిడిఒ పద్మజ, జెసిఎస్ మండల ఇన్‌ఛార్జి బొంతుల వెంకటరావు, వీరభద్రపురం సర్పంచ్ గేదెల మూర్తి, సంతపాలెం ఎంపిటిసి వెలగల రమణ, పాల్గొన్నారు.

శృంగవరపుకోట : వైసిపి ప్రభుత్వంలో పేదలకు ఎంతో మేలు జరిగిందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని సచివాలయం-3 పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి వివరించారు. స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. కమ్యూనిటీ హాలు మంజూరు చేయాలని బైక్ మెకానిక్‌లు ఎమ్మెల్యేకు వినతి అందించారు. వెంటనే ఆయన స్పందిస్తూ స్థల సేకరణ చేపట్టి, నిధులు మంజూరు చేస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో కొప్పల వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ నెక్కల నాయుడు బాబు, మాజీ ఎమ్మెల్యే శోభ హైమావతి, వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, వైసిపి మండల అధ్యక్షులు మోపాడ కుమార్, స్టేట్ డైరెక్టర్లు వాకాడ రాంబాబు, షేక్ మదీనా, పట్టణ అధ్యక్షులు షేక్ రెహమాన్, పోతనపల్లి వెంకటరావు, జెసిఎస్ ఇన్‌ఛార్జి వాకాడ సతీష్, ఎఎంసి డైరెక్టర్ దాసరి పార్వతి, పుణ్యగిరి ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ పోలమర శెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

సింగరాయి ఆర్‌బికెకు చేరిన ఎరువులు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సింగరాయి రైతు భరోసా కేంద్రానికి ఎరువులు చేరినట్లు ఎఒ యశ్వంత్‌కుమార్ తెలిపారు. రైతులకు అవసరమైన ఎరువులు సిద్ధంగా ఉంచినట్లు ఆయన చెప్పారు. ఎరువులు కావాల్సిన రైతులు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని విఎఎ కోమలి తెలిపారు.

అధికార పార్టీ సభ్యుల ధిక్కరణ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో అధికార పార్టీ సభ్యులు ప్రతి పాధించిన తీర్మాణాన్నే అదే పార్టీకి చెందిన సభ్యులు దిక్కరించిన సంఘటన చోటచేసుకుంది. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పి. సురేశ్ బాబు హాజరయ్యారు. ఆయా శాఖల పనితీరు పై చర్చించారు. అనంతరం మండల పరిషత్ ఎఒ పాత మండల పరిషత్ కార్యాలయం మరమ్మతులు, విద్యుద్దీ కరణ జరిపి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, ఎక్సైజ్ కార్యాలయాన్ని ఇక్కడకు తీసుకురావడానికి తీర్మానం చేశారు. అయితే ఈ తీర్మానాన్ని వైస్ ఎంపిపి సారికి వైకుంఠం నాయుడు, జెడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు వ్యతిరేకించారు. పాత భవనాన్ని లక్షలాది రూపాయలు ఖర్చు చేసి మరమ్మత్తులు చేయవద్దని వ్యతిరేకించారు. ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలని పాత మండల పరిషత్ కార్యాలయం మరమ్మత్తులు చేయాలంటే ఎమ్మెల్యే, ఎంపి నిధులు వినియోగించాలి గాని మండల పరిషత్ నిధులు ఖర్చు చేయడానికి ఒప్పుకోమని తెగేసి చెప్పారు. దీనిపై సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యులు అంబళ్ళ శ్రీరాముల నాయుడు వివరణ ఇస్తూ పాత మండల పరిషత్ కార్యాలయం శిధిలావస్థలో ఉన్నందున అక్కడ అసాంఘిక కార్యక్రమాలు చోటు చేసుకుంటున్నాయని మరమ్మతులు చేపట్టి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, ఎక్సైజ్ కార్యాలయం ఇక్కడకు తీసుకుని వస్తే అద్దెతో అందరికీ ఉపయోగంగా ఉంటుందని చెప్పారు. ఆమోద తీర్మానం సభ్యులు వ్యతిరేకిస్తే తన సొంత నిధులతో పాత మండల పరిషత్ కార్యాలయం మరమ్మత్తులు చేపడతానని స్పష్టం చేశారు. కాగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సాక్షిగా అధికార పార్టీ తీర్మానం అధికార పార్టీ సభ్యులే వ్యతిరేకించడం చర్చనీయాంశమైంది. ఎంపిపి వెర్సెస్ అధికార పార్టీ సభ్యుల గ్రూపుల పోరు బయట పడిందని చర్చ జరిగింది. ఈ సమావేశంలో ఎంపిపి అంబళ్ళ సుధారాణి, డిసిసిబి వైస్ ఛైర్మన్ చనమల్ల వెంకట రమణ, వైస్ ఎంపిపిలు సారికి వైకుంఠం నాయుడు, పతివాడ సత్యనారాయణ, టూరిజం డెవలప్మెంట్ కార్పొరషన్ రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, తహశీల్దార్ కె.వి. రమణ రాజు, మండల పరిషత్ ఎఒ పుష్ప, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ఘనంగా అశోక్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - విజయనగరం కోట

టిడిపి పోలిట్‌బ్యూరో సభ్యులు, కేంద్ర మాజీ మంత్రి పి.అశోక్‌గజపతిరాజు 73వ జన్మదిన వేడుకలు సోమవారం తన బంగ్లాలో ఘనంగా జరిగాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నగరంలోని పేర్లవారి వీధిలోగల చెవిటి, మూగ పాఠశాల విద్యార్థుల మధ్య అశోక్‌గజపతిరాజు కేక్ కట్ చేశారు. ముందుగా ఆయన పాత సిటీ స్టాండ్ దగ్గర ఉన్న వినాయక గుడి, పైడితల్లి అమ్మవారిని, కోటలో గల శక్తిని దర్శించుకున్నారు. అనంతరం పాఠశాలలో తన సతీమణి సునీలాగజపతి, కుటుంబ సభ్యులు కలసి కేక్ కట్ చేసి పిల్లలకు తినిపించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులను ఒక సంవత్సరం పాటు దత్తత తీసుకునేందుకు అశోక్ కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు కలిసి రూ.2.23లక్షలు విరాళాన్ని పాఠశాల నిర్వాహకులకు అందజేశారు. అనంతరం టిడిపి కార్యాలయం అశోక్ బంగ్లాలో జిల్లా టిడిపి నాయకులు ఏర్పాటు చేసిన పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్నారు. అశోక్‌కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో మాజీ మంత్రులు పతివాడ అప్పలనాయుడు, సుజయ్ కృష్ణ రంగారావు, మాజీ ఎమ్మెల్యేలు బొబ్బిలి చిరంజీవులు, భంజ్ దేవ్, కోళ్ల లలిత కుమారి, మాజీ ఎమ్మెల్సీలు గుమ్మడి సంధ్యారాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవి రాజు, పట్టణ అధ్యక్షులు లక్ష్మీ వరప్రసాద్, కార్యదర్శి బంగారు బాబు, కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, మండల అధ్యక్షులు బొద్దుల నర్సింగరావు, కనకల మురళీమోహన్, గంటా పోలినాయుడు, మైలపల్లి శ్రీనివాసరావు, రొంగలి రామారావు, ఎస్.కోట నియోజకవర్గ నాయకులు గొంప కృష్ణ, డెంకాడ మండల నాయకులు కంది చంద్రశేఖర్, జనసేన నాయకులు గురాన అయ్యలు ఉన్నారు. ఈ సందర్భంగా నైట్ షెల్టర్‌లో ఉన్న నిరాశ్రయులకు పాలూరిరాజునాయుడు, కోరాడ అప్పారావు తదితరులు భోజన వసతి కల్పించారు. నగరంలోని నిరాశ్రయుల వసతి గృహంలో కొత్తగా బోరు ఏర్పాటుకు రూ.24500 చెక్కును జనసేన నాయకులు గురాన అయ్యలు అశోక్‌గజపతిరాజు చేతుల మీదుగా అందజేశారు.



చెవిటి, మూగ విద్యార్థుల మధ్య పుట్టిన రోజు వేడుకలు జరుపుకుంటున్న అశోక్‌గజపతిరాజు

పిహెచ్‌సి వైద్యాధికారిగా అనిల్ కుమార్

ప్రజాశక్తి - లక్కవరపుకోట

లక్కవరపుకోట పిహెచ్‌సి రెండో వైద్యాధికారిగా అనిల్ కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతవరకు ఇక్కడ విధులు నిర్వహించిన డాక్టర్ సామ్రాజ్యలక్ష్మి జామి పిహెచ్‌సికి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో మునగపాక పిహెచ్‌సి నుంచి అనిల్ వచ్చారు. స్టాఫ్‌నర్స్ సిహెచ్ సన్యాసమ్మకు విశాఖ కెజిహెచ్‌కు బదిలీ కావడంతో ఆమె స్థానంలో శ్రీకాకుళం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి జమ్ము ఇందిర బాధ్యతలు చేపట్టారు. యుడిసి కె.శ్రీనివాసరావుకు వేపాడ పిహెచ్‌సికి బదిలీ కాగా, ఆ స్థానంలో విశాఖ కెజిహెచ్ నుంచి గంగాభవాని వచ్చి బాధ్యతలు చేపట్టారు. ఎంపిహెచ్ఎస్ ఈశ్వరరావుకు సొంత్యాం పిహెచ్‌సికి బదిలీ అయినట్లు వైద్యాధికారి పివి మురళీకృష్ణ తెలిపారు.

ఇష్టపడి చదివితే మంచి భవిష్యత్తు

ప్రజాశక్తి-బొబ్బిలి

ఇష్టపడి చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన అన్నారు. ఇంటర్ ఫలితాల్లో బైపిసిలో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిన చిత్రకోటబొడ్డవలసకు చెందిన కునుకు శిరీషను సోమవారం కోటలో బేబినాయన సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఇష్టపడి చదవాలన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివి తల్లిదండ్రులు ఆశయాలను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు రమ, శివ, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోలిపల్లిలో 'జగనన్న ఆణిముత్యాలు'

ప్రజాశక్తి- భోగాపురం

మండలంలోని పోలిపల్లి జెడ్‌పిహెచ్ స్కూల్‌లో ఇటీవల ఎంపికైన 'జగనన్న ఆణిముత్యాలు' విద్యార్థులకు సోమవారం సర్పంచ్ కర్రోతు వెంకటరమణ చేతుల మీదగా నగదు ప్రోత్సాహకాలను అందించారు. అనంతరం పదో తరగతిలో అధిక మార్కులు వచ్చిన ముగ్గురు విద్యార్థులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, స్కూల్ ఛైర్మన్ పిన్నింటి రమణ, టీచర్స్, సచివాలయ కన్వీనర్ పతివాడ రామకృష్ణ పాల్గొన్నారు.

డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశకి-బొబ్బిలి

పట్టణంలోని 10, 11 వార్డుల పరిధిలో గొల్లపల్లిలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.15 లక్షలతో సిసి డ్రెయిన్ల నిర్మాణానికి మున్సిపల్ ఛైర్మన్ సావు మురళీకృష్ణ సోమవారం శంకుస్థాపన చేశారు. పదో వార్డులో రూ.5 లక్షలు, 11వ వార్డులో 10 లక్షల వ్యయంతో సిసి డ్రెయిన్లు నిర్మించనున్నారు. కార్యక్రమంలో వైస్ ఛైర్‌పర్సన్ గొలగాన రమాదేవి, కౌన్సిలర్ కాకల గోవిందమ్మ, కో ఆప్షన్ మెంబర్ తెర్లి సత్యారావు, వైసిపి నాయకులు తుట్ట తిరుపతి, డిఇఇ రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి- డెంకాడ



డెంకాడ : సమావేశంలో మాట్లాడుతున్న సివిల్‌జడ్జి కె.నాగమణి

విద్యార్థులం మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి, డిఎల్ఎస్ఎ సెక్రటరీ కె. నాగమణి అన్నారు. లెండి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు బానిసలైతే విద్యార్థులు జీవితాలను కోల్పోతారన్నారు. ప్రతి ఒక్కరికీ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన ఉండాలన్నారు. అనంతరం పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్ శాశ్వత లోక్ అదాలత్ ఛైర్మన్ జి.దుర్గయ్య, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెల్లాన రవి, విజయనగరం సిఐ ఎన్. రాజేశ్వరి, భోగాపురం సిఐ కె.కె.విజయ నాథ్‌లను యాజమాన్యం సత్కరించింది. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ పి.మధుసూదనరావు, వైస్ ఛైర్మన్ పి.శ్రీనివాసరావు, సెక్రటరీ కె.శివరామకృష్ణ, కరస్పాండెంట్ వి.వి.రామారెడ్డి, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజాం : మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ బి.శ్రీధర్ ఆధ్వర్యంలో రాజాం శ్రీచైతన్య జూనియర్ కాలేజి విద్యార్థులు, రాజాం రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. గాయత్రి కాలేజి ప్రిన్సిపల్ లక్ష్మీ నాయుడు, సిఐ రవి కుమార్, రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ కొత్త సాయి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE AT VIZIANAGARAM.
E.P.No 133/2017 in O.S.No 73/2016.

Between:
Vudathu Venkata Kasi Viswanadham.
.....Decree Holder/Plaintiff.
And:
Vobbilisetty Raj Sekhar....Judgment Debtor/Defendant.
To
THE JDR: Sri Vobbilisetty Raj Sekhar S/o Satyanarayana, Hindu, aged about 49 Years, resident of R.Veeranna Building, 1" Floor, Opposite Sai Ram English Medium School, Kolluru Vari Street, Vizianagaram.

Please take notice that the above named DHR instituted the above matter against you for attachment of the below mentioned schedule property under provisions of Order 21 Rule 54 of C.P.C, thereby to sell the same under the provisions of Order 21 Rule 64 and 66 of C.P.C and to pay the amount realized to the Decree Holder. The said matter stands posted to 10th day of **July 2023 at 10.30 A.M.** for your appearance. On that date you to appear in person or through an advocate before the said Honourable Court at 10.30 A.M., failing which the matter will be heard and determined in your absence as exparte as per law.

SCHEDULE

Property together with entire construction situated in T.S No 794, 458, 460/2 bearing D/No 23-9-23/23-9-27 in Kolluruvari Street, Vizianagaram Town, Vizianagaram District, which is measured with 19 feet from east to west and 52 feet from north to south, which is bounded as follows:-
EAST : Property of Pallabhatla Nagamani,
SOUTH: Municipal Road, **WEST:** Municipal Road,
NORTH : Property of Dantuluri Sanyasi Satyanarayana.

BODDU SATYANARAYANA,
BODDU KARTHIK,
Advocate, Vizianagaram
Phone: 9492019394, 08922-222646.

ఆర్‌టిసి కాంప్లెక్సులో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -విజయనగరంకోట

విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్స్ అవుట్ గేటు టాయిలెట్స్ వద్ద ఎస్.కోటకు చెందిన పి.నానాజీరావు (48) ఒక్కసారిగా కుప్పకూలిపోయి మృతి చెందాడు. సాయంత్రం 5గంటల ప్రాంతంలో మరుగుదొడ్డి కోసం వెళ్లిన ఆయన బయటే పాస్‌పోస్తూ కుప్పకూలిపోయాడు. స్థానికులు గమనించి డిపో అధికారులకు తెలియజేశారు. వారుపోలీసులకు సమాచారం ఇవ్వడంతో అంబులెన్సు సాయంతో సర్వజన ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే నానాజీరావు మృతి చెందాడు.

బెల్ట్ షాప్ నిర్వాహకుడు అరెస్టు

గజపతినగరం : బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులో తీసుకున్నట్లు ఎస్ఐ సిహెచ్.గంగరాజు తెలిపారు. మండలంలోని రామన్నపేట గ్రామానికి చెందిన కర్రోతు సన్యాసిరావు బెల్ట్ షాపు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో సోమవారం సాయంత్రం దాడి చేసి 110 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సన్యాసిరావును అదుపులో తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విత్తన షాపుల్లో తనిఖీలు

బొబ్బిలి : మండలంలోని విత్తనాల షాపుల్లో వ్యవసాయ శాఖ ఎడి మహారాజన్ సోమవారం తనిఖీలు చేపట్టారు. విత్తనాల విక్రయాలు, నిల్వలపై ఆరాతీశారు. రికార్డుల తనిఖీ చేశారు. ఆదిత్య జనరల్ స్టోర్‌లో రికార్డుల నిర్వహణ సరిగా లేకపోవడంతో రూ.43,765 ఖరీదు చేసే కూరగాయ విత్తనాలను అమ్మకాలు నిలిపేశారు. ధనలక్ష్మి ఫెర్టిలైజర్ షాప్‌లో రికార్డుల నిర్వహణ సరిగా లేకపోవడంతో రూ.16,250 విలువైన వరి విత్తనాలను అమ్మకాలను నిలుపుదల చేయించారు.